ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీకాకుళం

జిల్లా వార్తలు

గురువారం 9 మే 2024



పోస్టల్ బ్యాలెట్‌కు నేడు చివరి అవకాశం

కలెక్టరేట్, మే 8: ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు గురువారం చివరి అవకాశం కల్పిస్తున్నామని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ పేర్కొన్నారు. నాలుగు రోజులుగా జిల్లాలో 41,225 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. మిగిలిన ఉద్యోగులంతా బాధ్యతగా ఓటు వేయాలని కోరారు. గురువారం సాయంత్రం 5గంటల వరకు వారు ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు.



శ్రీకాకుళం ఏడురోడ్ల జంక్షన్‌లో మూతపడిన అన్నక్యాంటీన్

- వైసీపీ అధికారంలోకి వచ్చాక అన్నక్యాంటీన్లు మూత
- టీడీపీ హయాంలో రూ.5తో కడుపునిండా భోజనం
- చంద్రబాబుకు పేరొస్తుందనే మూయించేసిన జగన్ సర్కారు
- రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ప్రజల మండిపాటు

పేదల పొట్టకొట్టారు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

ఏ ప్రభుత్వమైనా.. పేదల సంక్షేమం కోసం ఆలోచించాలి. వారికి ఉపాధి మార్గాలు చూపి.. కడుపు నింపేలా.. ఆర్థికంగా నిలదొక్కుకునేలా తోడ్పడాలి. కానీ వైసీపీ ప్రభుత్వం.. తన సైకోయిజంతో పేదలకు కడుపు నిండా దొరికే భోజనాన్ని దూరం చేసింది. టీడీపీ హయాంలో ఎందరికో ఆకలి తీర్చిన అన్నక్యాంటీన్లను ఎత్తివేసింది. దీంతో వైసీపీ ప్రభుత్వ తీరుపై అణగారిన వర్గాలు మండిపడుతున్నాయి. 'నేను పేదల పక్షపాతిని. మీ బిడ్డను. మీ సంక్షేమం నా బాధ్యత' అంటూ ఎప్పటికప్పుడు ఊకదంపుడు ప్రసంగాలు చేసే సీఎం జగన్‌వి అన్నీ ఉత్తుత్తి మాటలేనని ఆరోపిస్తున్నాయి. 2014 లో నవ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు స్వీకరించాక పేదల కోసం ప్రతిష్ఠాత్మకంగా 'అన్న క్యాంటీన్'లను ప్రవేశపెట్టారు. ఈ క్యాంటీన్‌లో రూ.5తోనే కడుపు నిండా భోజనం చేసే సదుపాయం కల్పించారు. పేదలు, విద్యార్థులు, కార్మికులు, దినసరి కూలీలు.. చిరుద్యోగులు.. ఇలా అన్నివర్గాల వారు అన్న క్యాంటీన్‌లను వినియోగించుకునేవారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం చేసేవారు. రోజంతా ఆహారం కోసం రూ.15లోపు మాత్రమే ఖర్చయ్యేది. ఎన్నో కుటుంబాలకు ఊరట లభించేది. వైసీపీ అధికారంలోకి వచ్చాక సీఎం జగన్మోహన్‌రెడ్డి అన్నక్యాంటీన్లను మూసివేయించారు. వాటి స్థానంలో కొన్నిచోట్ల భవనాలను ఇతర వాణిజ్య కార్యక్రమాలకు ఇచ్చేశారు. మరికొన్ని భవనాలను సచివాలయ భవనాలుగా మార్చుచేశారు. దీంతో అణగారిన వర్గాల ప్రజలు.. కార్మికులంతా ఉసూరుమన్నారు. పేదల గురించి ఆలోచించకుండా చంద్రబాబుకు పేరు వస్తుందన్న కారణంతో క్యాంటీన్‌లను ఎత్తివేశారంటూ సీఎం జగన్ తీరును దుయ్యబడుతున్నారు.

జిల్లాలో నాలుగు క్యాంటీన్లు మూత

వైసీపీ పాలనలో జిల్లాలో నాలుగు అన్నక్యాంటీన్లు మూతపడ్డాయి. శ్రీకాకుళంలో ఏడురోడ్ల జంక్షన్ వద్ద ఒకటి, కళింగ రోడ్డులో మరొక అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేశా రు. శ్రీకాకుళం ఏడురోడ్ల జంక్షన్ వద్ద అత్యధికంగా భవన నిర్మాణ కార్మికులు పనుల కోసం ఎదురుచూసేవారు. మేస్త్రీ పిలిస్తే పనులకు వెళ్లేవారు. లేదంటే ఈసురో మంటూ ఉండేవారు. అటువంటి వారందరికీ అన్నక్యాంటీన్‌లు అత్యంత ప్రయోజన కరమయ్యాయి. వారితో పాటు



ఆమదాలవలసలో మూతపడిన అన్నక్యాంటీన్..

నగరంలో పలు దుకాణాల్లో పనిచేసే కార్మికులు, చిరుద్యోగులు, విద్యార్థులు, షాపింగ్‌మాల్స్‌లో పనిచేసే మహిళలు.. ఇలా అందరూ వేలాదిగా మూడుపూటలా అన్నక్యాంటీన్లలో కడుపునిండా తినేవారు. ఆమదాలవలస, పలాసలో కూడా అన్న క్యాంటీన్‌లు నెలకొల్పి.. అక్కడ కార్మికులు, ఇతరత్రా వర్గాల ప్రజలకు రూ. 5తో భోజన సదుపాయం కల్పించారు. పలాసలో తితలీ తుఫాన్ సమయంలో అన్నక్యాంటీన్‌లు ఎందరినో ఆదుకున్నాయి. ఇచ్ఛాపురంలో కూడా అన్నక్యాంటీన్ కోసం భవనం నిర్మించారు. ప్రారంభిద్దామన్న సమయంలో ఎన్నికల కోడ్ వచ్చేయడంతో.. నిలిపివేశారు. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి రాగా.. అన్నక్యాంటీన్లను ఎత్తేశారు. శ్రీకాకుళం ఏడురోడ్ల జంక్షన్ వద్ద అన్నక్యాంటీన్‌ను మూసేసి.. ఆ స్థానంలో వైసీపీ నాయకుడొకరు ఓ చైనీస్ రెస్టారెంట్‌ను ఏర్పాటు చేశారు. జనం నవ్వుకున్నా.. ప్రజల నుంచి వైసీపీ నాయకులు ఛీత్కారాలు అందుకున్నా.. దర్జాగా రెండేళ్లపాటు రెస్టారెంట్‌ను నిర్వహించారు. ప్రజల నుంచి ఆదరణ లేకపోవడంతో ఆ రెస్టారెంట్‌ను మూసివేశారు. కళింగరోడ్డులో ఉన్న అన్నక్యాంటీన్‌ను మూసేసి.. ఆ భవనాన్ని వార్డు సచివాలయం కోసం కేటాయించారు. పలాస, ఆమదాలవలసలలో క్యాంటీన్లు కూడా మూసివేయించి వాటిని వేటికోసం వినియోగించలేదు. ఇచ్ఛాపురంలో కూడా భవనం నిరుపయోగంగా ఉంది.

● మళ్లీ టీడీపీ వస్తే తెరుస్తారని హామీ

టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఇటీవల జిల్లాకు వచ్చారు. తాము అధికారంలోకి వస్తే అన్న క్యాంటీన్‌లను తెరిపిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల మేనిఫెస్టోలో కూడా పెట్టారు. దీనిపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. శ్రీకాకుళం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్.. తన సొంత ఖర్చులతో రెండేళ్లపాటు మొబైల్ వాహనంతో అన్నక్యాంటీన్‌లు నిర్వహించారు. శ్రీకాకుళంలో పేదలు, కార్మికులు ఉండే ప్రాంతంలో క్యాంటీన్‌లు ఏర్పాటు చేసి ఉచితంగానే భోజనం పెట్టారు.

● తినేది పేదలు.. చంద్రబాబు కాదుగా..



ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తీరు చాలా విచిత్రంగా ఉంది. అన్న క్యాంటీన్‌లు తీసుకు వచ్చింది పేదల కోసం. అందులో లాభపడేది పేదలు మాత్రమే. చంద్రబాబు కాదు. ఈ విషయంలో రాజకీయాలకు పోయి సైకోయిజం చూపిస్తూ వైసీపీ ప్రభుత్వం క్యాంటీన్‌లను మూసివేసింది. పేదలు కడుపుకొట్టింది. ఇప్పుడు పేదలే ఓట్లతో వైసీపీకి బుద్ధి చెబుతారు.

-సిమ్మ శ్యామసుందరరావు, శ్రీకాకుళం


● వేలాది మందికి ప్రయోజనంగా ఉండేది..



అన్న క్యాంటీన్‌లతో వేలాదిమందికి ప్రయోజనంగా ఉండేది. ఉదయానే కేరేజీ తీసుకురావాల్సిన అవసరం లేకుండా రూ.5తో భోజనం తినేవాళ్లం. ఆటోడ్రైవర్లకు ఎంతగానో ఉపయోగపడింది. అన్నక్యాంటీన్‌లపై ప్రభుత్వం కక్షగట్టి మూసివేయించింది. పేరుమార్చి క్యాంటీన్‌లు కొనసాగించి ఉంటే బాగుండేది.

-కలమట శశిభూషణరావు, ఆటోడ్రైవర్

● కార్మికుల ఆకలి తీర్చేవి..



భవన నిర్మాణ కార్మికులకు నిర్దిష్టంగా పని ఉండదు. చేతిలో క్యారేజీ పట్టుకుని పని కోసం ఎదురుచూస్తారు. అన్నక్యాంటీన్‌లు వచ్చాక.. టిఫిన్, భోజనం చేసేవాళ్లం. పని కుదిరితే వెళ్లేవాళ్లం. భోజనం కోసం అదనంగా ఖర్చు ఉండేది కాదు. ఆకలితో ఉండాల్సిన పరిస్థితి ఏ కార్మికుడికి ఉండేది కాదు. టీడీపీ అధికారంలోకి వస్తే మళ్లీ తెరుస్తామని హామీ ఇవ్వడం సంతోషంగా ఉంది.

- రామారావు, భవన నిర్మాణరంగ కార్మికుడు



మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

సెక్టోరియల్ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి

- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, మే 8: 'ఎన్నికల నిర్వహణలో సెక్టోరియల్ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి. ఎన్నికల కమిషన్ సూచనలు శతశాతం పాటించాల'ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. బుధవారం జడ్పీ సమావేశ మందిరంలో సెక్టోరియల్ అధికారులకు ఈవీఎంల నిర్వహణ శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. రిసెప్షన్, స్ట్రాంగ్ రూమ్ భద్రతకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. 'సెక్టోరియల్ అధికారులకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 72గంటల ప్రొటోకాల్ చాలా కీలకం. మీ కేంద్రాలకు వెళ్లి ఎటువంటి సమస్యలు ఉన్నా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. సమయపాలన పాటించాలి. పోలింగ్ మెటీరియల్ పూర్తి స్థాయిలో తీసుకున్నదీ లేనిదీ చెక్‌లిస్టు ద్వారా పరిశీలించుకోవాలి' అని కలెక్టర్ సూచించారు.

● 'చిలకపాలెంలోని శివానీ ఇంజనీరింగ్ కళాశాలలో రిసెప్షన్ సెంటర్ ఏర్పాటు చేశాం. 13న ఉదయం 7నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. పోలింగ్ అనంతరం ఈవీఎంలు, ఆయా నియోజక వర్గాలకు కేటాయించిన స్ట్రాంగ్‌రూమ్‌లకు బస్సుల్లో జాగ్రత్తగా తీసకువెళ్లేలా చూడాల'ని సెక్టోరియల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడికక్కడ సైనేజ్ బోర్డులు, లైటింగ్ ఏర్పాటు చేశామన్నారు. ఆర్వోలు కౌంట్ చేసుకుని అన్ని వాహనాలు సులువుగా వచ్చేలా.. ట్రాఫిక్ రద్దీ లేకుండా చూడాలన్నారు. కేటాయించిన రూట్ల ద్వారా నిర్ణయించిన పార్కింగ్ స్థలం వద్దకే వాహనాలు చేరుకోవాలని సూచించారు.

● జేసీ ఎం.నవీన్ మాట్లాడుతూ.. 'సెక్టోరియల్ అధికారులు ఎన్నికల రోజున అన్ని పోలింగ్ కేంద్రాలకు సంబంధించి రిపోర్టులను కంట్రోల్ రూమ్‌కు అందజేయాలి. ఏదైనా కేంద్రంలో సమస్యలు ఉంటే తక్షణమే స్పందించి పరిష్కరించాలి. ఈవీఎంలలో సమస్య తలెత్తితే రిజర్వ్ పరికరాలతో వాటిని భర్తీ చేయాలి' అని తెలిపారు. నియోజకవర్గాలకు సంబంధించి సైనేజెస్ ఏర్పాటు చేస్తామని.. జాగ్రత్తగా వాహనాలు చేర్చాలని సూచించారు.

● కార్పొరేషన్ కమిషనర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ అధికారులంతా సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో వేంకటేశ్వరరావు, టెక్కలి సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్, అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఆర్వో ఎం.గణపతిరావు, ఏఎస్పీ ప్రేమ్‌కాజల్, ఆర్వోలు భరత్‌నాయక్, సీహెచ్ రంగయ్య, రామ్మోహన్, నోడల్ అధికారి బాలాజీ నాయక్, మాస్టర్ ట్రైనర్ శేషగిరి, ఎన్ఐసీ కిరణ్ పాల్గొన్నారు.

ఐఎఫ్ఎస్‌కు కృష్ణచైతన్య ఎంపిక



కృష్ణచైతన్య

సరుబుజ్జిలి, మే 8: సరుబుజ్జిలి మండలం కూన జమ్మన్నపేట గ్రామానికి చెందిన సింగూరు కృష్ణచైతన్య ఐఎఫ్ఎస్‌కు ఎంపికయ్యారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 83వ ర్యాంక్ సాధించారు. కృష్ణచైతన్య తండ్రి రంగనాయకులు ప్రభుత్వ ఉపాధ్యాయుడు. ఉద్యోగ రీత్యా భార్య మీనాతో కలిసి ఆమదాలవలసలో నివాసం ఉంటున్నారు. ఉన్నత ఉద్యోగం సాధించేలా కృష్ణచైతన్యను తల్లిదండ్రులు ప్రోత్సహించారు. ఈ మేరకు 2021లో నిర్వహించిన సివిల్స్ ఎఫ్ఎస్ పరీక్షల్లో ఇంటర్వ్యూస్థాయికి వెళ్లిన కృష్ణచైతన్యకు నిరాశ ఎదురైంది. గతేడాది ఆన్‌లైన్‌లో కోచింగ్ తీసుకుని.. ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ పరీక్ష రాశారు. ఆలిండియా స్థాయిలో ప్రతిభ చూపడంతో తల్లిదండ్రులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కృష్ణచైతన్య విశాఖపట్నంలోని ఈపీఎఫ్‌వో డిపార్ట్‌మెంట్‌లో అకౌంట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

ప్రశాంతంగా ఈసెట్

ఎచ్చెర్ల, మే 8: పాలిటెక్నిక్ డిప్లమో పూర్తయిన విద్యార్థులు ఇంజనీరింగ్ కోర్సుల్లో నేరుగా రెండో సంవత్సరంలోకి ప్రవేశానికి సంబంధించి ఏపీ ఈసెట్ ఆన్‌లైన్ విధానంలో బుధవారం ప్రశాంతంగా నిర్వహించారు. జిల్లాలోని శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల(చిలకపాలెం), శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల), ఐతం(టెక్కలి), కోర్ టెక్నాలజీస్ (నరసన్నపేట) కేంద్రాల్లో ఈ పరీక్ష రెండు షిఫ్టుల్లో జరిగింది. శివానీ కళాశాలలో 200 మంది విద్యార్థులకు 189 మంది, శ్రీ వెంకటేశ్వరలో 200 మందికి 193 మంది పరీక్షకు హాజరయ్యారు.

పాలిసెట్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల, మే 8: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి గత నెలలో నిర్వహించిన పాలిసెట్ ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. జిల్లాకు సంబంధించి 6,288 మంది బాలురు, 4,583 మంది బాలికలు మొత్తం 10,871 మంది పాలిసెట్ రాశారు. ఇందులో బాలురు 5,452 మంది, బాలికలు 4,124 మంది మొత్తం 9,576 మంది (88.09 శాతం) ఉత్తీర్ణులయ్యారు. పోలాకి మండలానికి చెందిన గొల్లంగి అరవింద్ 112వ ర్యాంకు, ఆమదాలవలసకు చెందిన కూన హర్షిత 115వ ర్యాంకు, కోటబొమ్మాళికి చెందిన సకలాభక్తుల శ్రీవల్లి 143వ ర్యాంకు సాధించారు.

కారులో పట్టుబడిన నగదు



శ్రీకాకుళం క్రైం, మే 8: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బుధవారం శ్రీకాకుళం సింహద్వారం వద్ద ఎస్ఎస్‌టీ బృందం వాహనాలు తనిఖీ చేయగా.. ఓ కారులో నగదు పట్టుబడింది. కుశాలపురానికి చెందిన దానేటి రాజశేఖర్ కారులో పీఎన్ కాలనీ వెళ్తున్నారు. సింహద్వారం వద్ద ఎస్ఎస్‌టీ అధికారులు తనిఖీ చేయగా.. రూ.1,04,600 లభ్యమైంది. దానిని సీజ్ చేసి తహసీల్దార్ రాణి నేతృత్వంలో ట్రెజరీకి అప్పగించారు. కాగా.. రాజశేఖర్ తాను బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి నగదు తీసుకొచ్చినట్టు పోలీసులకు వివరించారు. జిల్లా కమిటీకి ఆధారాలు చూపి నగదు తీసుకెళ్లాలని అధికారులు సూచించారు.

వైసీపీలో ఓటమి భయం!

- అందుకే కూటమి శ్రేణులపై వరుస దాడులు
- జిల్లాలో రెచ్చిపోతున్న అధికారపార్టీ నేతలు
- కత్తులు, రాళ్లతో దాడిచేసి భయభ్రాంతులు
- ఎన్నికల్లో అడ్డగోలుగా గెలవాలన్న ఉద్దేశం
- వారంలో రెండు ఘటనలతో కలకలం
- పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నలు
- తాజాగా ఎచ్చెర్ల అభ్యర్థి ఎన్ఈఆర్‌పై దాడి
- జనసేన పార్టీ కార్యకర్తకు గాయాలు

రణస్థలం: పోలింగ్‌కు గడువు దగ్గరపడే కొద్దీ వైసీపీ శ్రేణులు బరితెగిస్తున్నాయి. ఓటమి భయంతో కూటమి నాయకులపై వరుస దాడులకు పాల్పడుతున్నాయి. ఎలాగైనా గెలవాలని కత్తులు, రాళ్లతో భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. వైసీపీకి జై కొట్టాలంటూ బెదిరిస్తున్నాయి. ఈనెల 6న ఆమదాలవలస టీడీపీ అభ్యర్థి రవికుమార్ సతీమణిపై కత్తితో దాడి మరువకముందే బుధవారం రాత్రి మరో ఘటన చోటుచేసుకోవడం కలకలం రేపుతోంది. ప్రచారానికి వెళ్లిన ఎచ్చెర్ల అభ్యర్థి ఎన్ఈఆర్, కార్యకర్తలపై అధికారపార్టీ కార్యకర్తలు రాళ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో ఓ యువకుడికి గాయాలయ్యాయి.



వైసీపీ శ్రేణుల దాడిలో గాయపడిన జనసేన కార్యకర్త

ఇంతజరుగుతున్నా పోలీసులు ఏం చేస్తున్నారన్న ప్రశ్న వ్యక్తమవుతోంది. అధికారపార్టీ శ్రేణులు ఎంత రెచ్చిపోతున్నా.. బెదిరిస్తున్నా.. దాడులు చేస్తున్నా ఎన్డీఏ కూటమి శ్రేణులు ఎక్కడా తగ్గడం లేదు. వారికి వెరవకుండా ప్రజల్లోకి దూసుకు పోతున్నారు. అధికారపార్టీ ఆగడాలను ఎండగడుతున్నారు. వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే ఏం జరుగుతుందో వివరిస్తున్నారు.

త్రుటిలో తప్పించుకున్న ఎన్ఈఆర్

ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థిగా బీజేపీ తరఫున ఎన్.ఈశ్వరరావు పోటీ చేస్తున్నారు. నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఓటర్లను కలుసుకుంటున్నారు. అయితే దీన్ని వైసీపీ నాయకులు తట్టుకోలేక పోతున్నారు. బుధవారం రాత్రి 8.30 గంటలకు ఆత్మీయ కలయికలో భాగంగా ఎన్ఈఆర్‌తో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు ఎన్‌జీఆర్ పురానికి వెళ్లారు. గ్రామంలో ప్రచారం చేసుకుంటూ వెళ్తుండగా.. స్థానిక వైసీపీ నాయకులు, కార్యకర్తలు రాళ్లతో దాడికి దిగారు. అప్రమత్తమైన కార్యకర్తలు ఎన్ఈఆర్‌ను వెంటనే కారులో ఎక్కించి వెనక్కి పంపించారు. ఎన్ఈఆర్ రాళ్ల దాడి నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. ఒక జనసేన కార్యకర్తకు గాయాలు అయ్యాయి. ప్రజాస్వామ్య బద్ధంగా ఎదుర్కోవాలిగానీ, ఇలా రాళ్లదాడికి దిగడం శోచనీయమని కూటమి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తొలి నుంచి చెబుతున్నా..

ప్రస్తుతం ఎచ్చెర్ల ఎన్డీఏ అభ్యర్థి ఎన్ఈఆర్‌పై దాడి చేసిన గ్రామంలోనే 12 రోజుల క్రితం వైసీపీ శ్రేణులు రెచ్చిపోయాయి. ఎన్‌జీఆర్‌పురం పంచాయతీ పరిధిలో చీకటిపేట, గురయ్యపేట, పాతయ్య పేట గ్రామాల్లో టీడీపీ, జనసేనపార్టీకి బలమైన ఓటు బ్యాంకు ఉంది. ఇక్కడ 1,450మంది ఓటర్లు ఉన్నారు. ఈ గ్రామాలకు చెందిన వారు ఎచ్చెర్ల బీజేపీ అభ్యర్థి నడుకుదుటి ఈశ్వరరావు తరఫున ఎన్నికల ప్రచారానికి, పార్టీ కార్యక్రమాలకు హాజరవుతున్నారు. దీన్ని ఆయా గ్రామాల వైసీపీ నేతలు, కార్యకర్తలు



ఎన్‌జీఆర్ పురంలో ప్రచారం చేస్తున్న ఎన్ఈఆర్

జీర్ణించుకోలేక పోయారు. టీడీపీ, జనసేనపార్టీ సానుభూతిపరులపై దాడులకు తెగబడ్డారు. వారిని భయపెట్టారు. 'మమ్మల్నే ఎదిరిస్తారా?' అంటూ గద్దించారు. దీంతో కొన్ని కుటుంబాలు వేరే గ్రామాల్లో తలదాచుకుంటున్నాయి. ఈ ఘటనలపై ఫిర్యాదులు వెళ్లడంతో ఆ గ్రామాల్లో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.

ఈనెల 6న కూన ప్రమీలపై కత్తితో..

ఈనెల 6వ తేదీన సోమవారం ఆమదాలవలస టీడీపీ అభ్యర్థి కూన రవికుమార్ సతీమణి కూన ప్రమీల పొందూరు మండలంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థుల గెలిపించాలని ఓటర్లను కోరారు. ఇది అధికారపార్టీ జీర్ణించుకోలేక పోయింది. ప్రమీల రాత్రి 8 గంటల సమయంలో కోటిపల్లి పంచాయతీ మజ్జిలపేట గ్రామానికి వెళ్లి ప్రజలను ఓట్లు అడుగుతున్నారు. ఇంతలో కొందరు వైసీపీకి చెందినవారు టీడీపీ శ్రేణులను రెచ్చగొట్టడం మొదలు పెట్టారు. అయినా టీడీపీ నాయకులు, కార్యకర్తలు వారిని పట్టించుకోలేదు. ఇల్లిల్లూ తిరుగుతూ ఓట్లు అడుగుతున్నారు. ప్రచారం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఇంతలోనే గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇదే సమయంలో అదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త గురుగుబెల్లి రమణ కత్తితో కూన ప్రమీలపై దాడికి పాల్పడ్డాడు. అయితే అక్కడే ఉన్న ప్రమీల కారుడ్రైవర్ సింగూరు కసవయ్య రమణను అడ్డుకోవడంతో అతని చేతికి తీవ్ర గాయమైంది. టీడీపీ నాయకులు రమణను తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ముందస్తు పథకం ప్రకారమే గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిపివేసి తమపై దాడికి పాల్పడ్డారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. పోలీసులు దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

టీడీపీలో చేరామని ఇంటిని కాల్చేశారు


- పోలీసులకు బాధితుల ఫిర్యాదు

సంతబొమ్మాళి: టీడీపీలో చేరామన్న కక్షతో ఇంటిని దహనం చేశారని హెచ్ ఎన్‌పేట పంచాయతీ పోతునాయుడుపేటకి చెందిన బేతల ఈశ్వరరావు, కవిత ఆవే దన వ్యక్తం చేశారు. ఇంటి మరమ్మతుల కోసం పాత రేకులు తొలగించి కొత్త రేకులు వేస్తున్నామని, మంగళవారం రాత్రి ఇంటిని వైసీపీ నాయకుడి ప్రోద్బలంతో ఆ పార్టీ కార్యకర్తలు దహనం చేశారని వారు ఆరోపించారు. ఐదుగురు అనుమానితులపై నౌపడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నౌపడ ఎస్ఐ కిషోర్ వర్మ ఘటన స్థలానికి చేరుకుని ఆరా తీశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, ఇది రాజకీయ కక్షతో జరిగిన ఘటన కాదని, ఏడాదిగా ఈ ఇంటి కోసం తగాదా ఉందని ఎస్ఐ తెలిపారు.

రాజకీయ కట్టప్పలు..

(రణస్థలం)

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గర పడుతుండడంతో రాజకీయాలు రస వత్తరంగా మారుతున్నాయి. ప్రధాన రాజకీయపార్టీలు ప్రచారాన్ని ముమ్మరంచేశాయి. ఈనేపథ్యంలో ఎవరికి వారే గెలుస్తామన్న ధీమా వ్యక్తం చేస్తున్నా, అంతర్గతంగా కోవర్టుల భయం వెంటాడుతోంది. స్వపక్షంలోనే ఉండి పనిచేసే కన్నా ప్రత్యర్థి వర్గంలోకి చేరి వారి అనుపానులను చేరవేయడం ఓ కోవర్టు రాజకీయం. స్వపక్షంలోనే కొనసాగుతూ వారి వ్యూహాలను ప్రత్యర్థి పార్టీకి చేరవేయడం మరో కోవర్టు కళ. రాజకీయ పార్టీల గెలుపు ఎత్తుల్లో ఇది కూడా ఓ వ్యూహమే. పార్టీలోకి వచ్చే వారిని కాదనలేరు. అలా అని అందరినీ కోవర్టులుగా చూడలేరు. ఒకరిద్దరు మాత్రం ఈ తరహా వ్యక్తులు కచ్చితంగా ఉంటారని నేతలే నమ్ముతున్నారు. ఒకవిధంగా వీరంతా రాజకీయ కట్టప్పలు. ఎప్పుడు వెన్నుపోటు పొడుస్తారో చెప్పలేం. వచ్చిన చిక్కల్లా ఆ కోవర్టులను ఎలా పసిగట్టడం అనేది మాత్రమే. దీంతో ఏం మాట్లాడితే.. ఏమవుతుందోనని అభ్యర్థులు భయాందోళన చెందుతున్నారు. తమతో సన్నిహితంగా ఉన్నవారిలో ఎవరిని నమ్మాలో, ఎవరితో ఎలా మాట్లాడాలో, ఎవరితో రహస్య సమాచారాన్ని పంచుకోవాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. కొంతమంది ఉదయం ఒక పార్టీలో ఉంటే, సాయంత్రం వేరే పార్టీ కండువాతో ప్రత్యక్షమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఎవరు సన్నిహితులో, ఎవరు పార్టీ విధేయులో, ఎవరు నమ్మక ద్రోహులో తెలియక ఇబ్బందిపడుతున్నారు. ప్రధాన రాజకీయ పార్టీల్లో ఈ బెడద మరీ ఎక్కువగా ఉంది. అప్పటి వరకు తనతో ఉండే నేతలు, కార్యకర్తలను ఏదో ఒక ఎరవేసి, ఇతర పార్టీల్లోకి చేర్చుకుంటున్నారు. ఈ పరిస్థితుల నుంచి ఎలా బయటపడాలో తెలియక ప్రధాన రాజకీయ పార్టీ అభ్యర్థులు మల్లగుల్లాలు పడుతున్నారు.





- అభ్యర్థులకు కోవర్టుల బెడద
- ఎవరిని నమ్మాలో తెలియని పరిస్థితి
- ఏం మాట్లాడితే.. ఏమవుతుందోనని భయం
- అన్ని పార్టీల్లోనూ ఇదే సమస్య

కోవర్టులు రకరకాలు..

ఎన్నికల వేళ రాజకీయ పార్టీలు వివిధ రకాలుగా కోవర్ట్ ఆపరేషన్ చేపడుతుంటాయి. వాటిలో ముఖ్యంగా ప్రత్యర్థి శిబిరంలోనే ఉంచి దెబ్బతీయడం. ఇటీవల ఓ అభ్యర్థి వద్దకు ద్వితీయ శ్రేణి నేత ఒకరు తాను ప్రస్తుతం ఉన్న పార్టీని వదిలేసి మీ గూటికి వస్తానని వర్తమానం పంపారు. ఆ అభ్యర్థి మాత్రం పార్టీ మారేకంటే అక్కడే ఉండి వారి పథక రచనలన్నీ తనకు చేరవేయాలని... ఇదే తనకు చేసే మేలు అని చెప్పారు. అంతే అటు పార్టీ మారినట్లయింది. ఇటు కోవర్ట్ ఆపరేషన్ మొదలయ్యింది. ఆవల శిబిరంలోకి వెళ్లి వారి నేతలు, కార్యకర్తలతో మమేకమైపోయి... వారి వ్యవహారాలన్నీ గుట్టు చప్పుడు కాకుండా తన సొంత శిబిరం నేతలకు చేర్చడం ఇదో రకం కోవర్టు వ్యవహారం. వీరు తటస్థంగా ఉన్నట్లు కలరింగ్ ఇస్తూ ఏదో ఒక పక్షానికి లోపాయికారిగా పనిచేస్తారు. పోలీసులు నేరుగా డబ్బు ఉన్న చోటుకు వెళ్లి కొన్ని సందర్భాల్లో దాడులు చేస్తుంటారు. ఇదంతా ఈ తటస్థ కోవర్టుల పుణ్యమే. ఇలా కోవర్టులందు రకాలు వేరయా అన్న చందాన వీరితో పెను ప్రమాదం కూడా అభ్యర్థులకు పొంచి ఉందండోయ్.

నేతల్లో టెన్షన్..

రాజకీయం అంటేనే ఎదుటి వారి బలాలు, బలహీనతలు తెలుసుకుని వాటికి అనుగుణంగా గెలుపు వ్యూహాలు రచిస్తూ ఉంటాయి. కానీ నిన్న మొన్నటి వరకు తమ వెంట తిరిగిన వారు ఇప్పుడు ఆవలి పక్షాన కనబడుతుండే సరికి వారిలో టెన్షన్ అధికమవుతోంది. వారి లోగుట్టులన్నీ ఆ నేతలకు తెలిసి ఉండడమే అందుకు కారణం. తన అంతరంగికులుగా మెలిగే ఒకరిద్దరు నేతల వద్ద మాత్రమే ఎన్నికల వ్యూహాలకు సంబంధించిన వివరాలు పంచుకుంటున్నారు. గోడలకు చెవులు ఉండొచ్చు అనే చందాన అత్యంత రహస్యంగా ఎన్నికల ప్రణాళికలకు పదును పెడుతూ కోవర్టు రాజకీయాలకు చెక్ పెట్టాలనే తలంపుతో నేతలు ఉన్నారు.

నోరు అదుపులో లేకుంటే ఇబ్బందే..

వాక్‌స్వాతంత్ర్యం ఉంది కదా అని ఏది పడితే అది మాట్లాడేందుకు వీల్లేని పరిస్థితి నెల కొంది. ప్రస్తుతం ప్రతి మాట ఆచితూచి మాట్లాడాల్సివస్తోంది. నోరు అదుపులో పెట్టుకో కపోతే ఇబ్బందులు తప్పవని అభ్యర్థులకు అనుచరులు సూచిస్తున్నారు. లేదంటే తగినమూ ల్యం చెల్లించుకోవల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ముఖ్యులతో సమావేశమైనప్పుడు తప్పితే, ఎక్కడపడితే అక్కడ విలువైన సమాచారాన్ని లీక్ చేస్తేందుకు భయపడుతున్నారు. ప్రచారంఘట్టం సమీపిస్తుండడంతో చివరి అంకంగా ఓటర్లకు మద్యం, డబ్బుతో ఆకట్టుకోవల్సి ఉంటుంది. వీటిని అభ్యర్థులు తన ప్రధాన అనుచరులకు మాత్రమే చెబుతున్నారు. బయటకు లీకైతే కోవర్టుల ద్వారా నిఘా బృందానికి సమాచారం చేరే అవకా శంలేకపోలేదు.దీంతో కోవర్టుల విషయంలో అభ్యర్థులు ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు. దీనికితోడు ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ప్రతి విషయం ఎన్నికల కమిషన్ క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. ప్రధాన కూడళ్లలో పోలీసు చెక్‌పోస్టులు కూడా ఏర్పాటయ్యాయి. జిల్లాలో అక్కడక్కడ అనుమతుల్లేకుండా నగదు, మద్యం తదితర వాటిని తరలిస్తూ పట్టుబడుతున్నారు. పోలీసుల కళ్లగప్పి క్షేత్రస్థాయిలోకి తాయిలాలను చేర్చడం సులువైన పనికాదు. పోటీ నువ్వా నేనా ఉండే నియోజకవర్గాల్లో పోలీసుల నిఘా కంటే ప్రత్యర్థుల నిఘా ఎక్కువగా ఉంది. ప్రత్యర్థి విజయావకాశాలను దెబ్బతీసే కార్యక్రమాలను కూడా పదును పెడుతున్నారు.

వ్యూహాలను బెడిసికొట్టేలా..

ప్రచారం హోరెత్తించడం ఒక ఎత్తయితే, ప్రత్యర్థి పార్టీ ఎత్తులను చిత్తు చేయడం మరో ఎత్తు. ఇందుకు అనుగుణంగా ప్రధాన పార్టీలు కార్యాచరణ సిద్ధం చేసుకున్నాయి.. గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతూ, ఎదుటి పార్టీ వ్యూహాలను బెడిసి కొట్టేలా వ్యూహరచన చేస్తున్నాయి. ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు చేపట్టే రహస్య కార్యక్రమాలు తెలుసుకునేలా టార్గెట్ చేస్తున్నారు. ప్రత్యర్థి బలాబలాలను అంచనా వేయడం ద్వారానే విజయానికి చేరువకావచ్చని భావిస్తున్నారు.

భలే అవకాశవాదం..

కోవర్ట్‌లకు మరో అవకాశం కూడా ఉంది. ప్రత్యర్థి పార్టీ ప్రయోజనాల కోసం పనిచేసినా.. సొంత పార్టీ గెలిస్తే గుట్టుచప్పుడు కాకుండా ఈ విజయం క్రెడిట్‌ను తన ఖాతాలో వేసుకుని ఎంచక్కా ఆ నేత నీడలోనే ఉండొచ్చు. ఇలా కాకుండా ఎవరికోసమైతే కోవర్టు అవతారమెత్తారో వారే గెలిస్తే దర్జాగా మళ్లీ వారి దగ్గరకు వెళ్లిపోయి అక్కడా గెలుపు క్రెడిట్‌ను తన ఖాతాలో వేసుకునే సౌలభ్యం కోవర్టులకు మాత్రమే ఉంది.

ఎవరికి ఓటేస్తారో?

- ఏ అభ్యర్థి ప్రచారానికి వచ్చినా జేజేలు కొడుతున్న జనాలు

(జలుమూరు)

అసెంబ్లీ, లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల ప్రచారం ఆఖరు ఘట్టానికి చేరు కుంది. ఈనేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలు ప్రచారం ఉధృతం చేశాయి. గ్రామాల్లో ఎన్నికల ప్రచారానికి వస్తున్న అభ్యర్థులకు ప్రజలు అట్టహాసంగా స్వాగతం పలికి మంగళహారతులు అందించి నీరాజనాలు పలుకుతున్నారు. ప్రధానపార్టీల అభ్యర్థులను గ్రామస్థాయి నాయకుల ప్రోత్సాహంతో మహిళలు నుదుటను తిలకం దిద్ది జేజేలు పలుకుతున్నారు. ఆయాపార్టీల మేనిఫెస్టోలను వివరించి అభ్యర్థులను గెలిపించాలని నాయకులు, అభ్యర్థులు కోరుతున్నారు. ఏపార్టీ అభ్యర్థి వచ్చిన జేజేలు పలుకుతున్న ఓటర్లు పోలింగ్ రోజున ఓటుఎవరికి వేస్తారోనన్న ఆందోళన అభ్యర్థుల్లో నెలకొంది. ఒకే కుటుంబానికి చెందిన తండ్రి ఒక పార్టీకి మద్దతు తెలిపితే కుమారుడు మరో పార్టీకి మద్దతు పలికి జేజేలు కొడుతున్నారు. చివరకు ఓటరు ఏపార్టీకి నీరాజనాలు అందిస్తారనేది వేచి చూడాల్సిందే.



మన ఓటు.. మన హక్కు

- ఆకట్టుకున్న సైకత శిల్పం

(ఆమదాలవలస)

సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా మండలంలోని సంగమేశ్వర కొండ సమీపంలో రూపొందించిన సైకత శిల్పం ఆకట్టుకుంటోంది. ఓటు విలువను తెలియజేస్తూ గాజుల కొల్లివలసకు చెందిన సైకత శిల్పి గేదెల హరికృష్ణ దీన్ని తీర్చిదిద్దారు. మన ఓటు- మన హక్కు పేరుతో రూపొందించిన సైకత శిల్పం ఆలోచింపజేస్తోంది.

అధికారంలోకి వచ్చిన వెంటనే..
తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

- యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం
- పలాస టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష

ఇంటర్వ్యూ

(పలాస)



రాష్ట్రంలో టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని, నియోజకవర్గంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా డిఫెన్స్ అకాడమి, స్కిల్‌డెవలప్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని పలాస నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష తెలిపారు. బుధవారం ఆమెతో 'ఆంధ్రజ్యోతి' ముఖాముఖి నిర్వహించింది. ఈ సందర్భంగా పలు ప్రశ్నలకు శిరీష సమాధానాలు చెప్పారు.

➡ **ప్రశ్న:** నియోజకవర్గంలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేస్తారా?

➡ **జవాబు:** కచ్చితంగా. ప్రధానంగా ఆఫ్‌షోర్ రిజర్వాయరు నియోజక వర్గ ప్రజల చిరకాల వాంఛ. దివంగత నేత అప్పయ్యదొర దీన్ని రూపొందించగా, తన తండ్రి గౌతు శివాజీ.. గెడ్డం దీక్ష చేసి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టుకు నిధులు రప్పించుకున్నారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆఫ్‌షోర్‌ను నిర్లక్ష్యం చేసింది. నేను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ఈ ప్రాజెక్టును పూర్తిచేసి ప్రతి ఎకరాకూ సాగునీటిని అందిస్తాం. అలాగే, డబారు సింగ్, కళింగదళ్ కాలువలను ఆధునికీకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాం. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘ ప్రజల దాహార్తిని తీర్చేందుకు కృషి చేస్తాను. వజ్రపుకొత్తూరు మండలంలోని పూడిలంక వారధిని పూర్తి చేస్తాం. మంచినీళ్లపేట-నువ్వలరేవు బ్రిడ్జి రోడ్డుకు ఉన్న అవరోధాలు తొలగిస్తాం. కాశీబుగ్గ ఫ్లైఓవర్ బ్రిడ్జిని పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తాం. కిడ్నీ పరిశోధన కేంద్రంలో పూర్తిస్థాయి వైద్యాలయానికి కృషి చేసి రోగులకు బాసటగా నిలుస్తాం.

➡ **ప్ర:** మీ భర్త వ్యాపారులను వేధిస్తారనే ప్రచారం ఉంది. ఇందులో నిజమెంత ?

➡ **జ:** అదంతా అవాస్తవం. ప్రతిసారీ ఎన్నికలు రాగానే నా భర్త వెంకన్నచౌదిరి ప్రస్తావన తీసుకువస్తున్నారు. వాస్తవాలను వ్యాపారులనే అడిగి తెలుసుకోవాలి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో లాభపడింది ఒక వర్గమే. అదే వర్గం మా ఇమేజిని దెబ్బతీయాలని కుట్రపన్నింది. ప్రస్తు తం పలాస నియోజకవర్గ ప్రజలు నిజాన్ని గుర్తించారు. మా పార్టీలో చేరుతున్న వారిలో వ్యాపారులే అధికంగా ఉండడం ఇందుకు ఉదాహరణ.

➡ **ప్ర:** మీరు లోకలా.. నాన్ లోకలా?

➡ **జ:** నేను పక్కా లోకల్. నా తాత గౌతు లచ్చన్న, తండ్రి గౌతు శివాజి సోంపేట మండలంలో జన్మించారు. నేను కూడా అక్కడే పుట్టిపెరిగాను. నా తాత తండ్రుల ఆస్తులు సైతం నియోజకవర్గంలోని మందసలో ఉన్నాయి. ఉన్నత చదువుల కోసం బయటకు వెళ్లానే తప్పా నేను పక్కా లోకల్. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఆడబిడ్డనే. నా ధృవపత్రాలన్నీ గౌతు పేరుతోనే ఉంటాయి. ప్రస్తుతం పలాస మండలం శాసనం పంచాయతీ పరిధిలో సొంత స్థలాన్ని కొనుగోలు చేసుకొని అక్కడే ఇల్లు కూడా కట్టుకున్నా. నేను లోకల్ కాదన్న వారికి ఇదే నా సమాధానం. పొరుగు మండలంలో పుట్టిన మంత్రి అప్పలరాజు ఇక్కడ నివాసం ఏర్పచుకొని లోకల్‌గా చెలామణి అవ్వడం లేదా?

➡ **ప్ర:** వైసీపీ నాయకులు భూములను ఆక్రమించుకున్నట్లు మీ వద్ద ఆధారాలు ఉన్నాయా?

➡ **జ:** అన్ని ఆధారాలు ఉన్నాయి. నియోజకవర్గంలోని కొండలు, గుట్టలు, కాలువలు, ప్రైవేటు స్థలాలను వైసీపీ నేతలు ఆక్రమించారు. పేర్లతో సహా ఆధారాలు మొత్తం జిల్లా కలెక్టర్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి అందించాను. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతాం. జిరాయతీ స్థలాలకు రక్షణ వలయంగా ఉంటాం. ఆక్రమణదారులపై సివిల్, క్రిమినల్ కేసులు పెడతాం.

➡ **ప్ర:** ఎలుగుబంట్ల నుంచి ప్రజలను కాపాడడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

➡ **జ:** వజ్రపుకొత్తూరు, మందస మండలాల్లో ఎలుగు బంట్ల సంచారం ఎక్కువగా ఉంది. అవి ప్రజలపై దాడి చేసి ప్రాణాలు తీస్తున్నాయి. కొండలను ఆక్రమించడంతో అవి జనావాసాల్లోకి వచ్చేస్తున్నాయని అటవీశాఖ అధికారులే చెబుతున్నారు. దీనికితోడు అధిక వేడి కావడంతో నీటి కోసం గ్రామాల్లోకి వచ్చేస్తున్నాయి. వీటిని అరికట్టడానికి ముందుగా కొండలపై పచ్చని మొక్కలను పెంచి వాటికి రక్షణ కల్పిస్తాం. కొండ ప్రాంతాల్లో నీటి తొట్టెలు ఏర్పాటు చేయడంతో పాటు ఆహారం అందేలా చర్యలు చేపడతాం.

➡ **ప్ర:** గత ఎన్నికల్లో ఓటమితో మనోస్థైర్యం కోల్పోయారా?

➡ **జ:** లేదు. 2019 ఎన్నికల్లో ఓటమి చెందిన తరువాత మనోస్థైర్యం దెబ్బతినలేదు. నా పని నేను చేసుకోవడం, ప్రజా సమస్యలపై స్పందించడం, తెలుగుదేశం పథకాలపై ప్రచారాలు చేసుకొని సిద్ధం కావాలని యోచించాను. కానీ, వైసీపీ నాయకులు నాపై, నా కుటుంబంపై కక్షగట్టి వికృత చేష్టలకు పాల్పడ్డారు. నా అనుచరులను కేసుల్లో ఇరికించి మానసికంగా ఇబ్బందికి గురిచేశారు. నాపై తప్పుగా సోషల్ మీడియాలో పోస్టింగులు పెట్టారు. వారి చేష్టలకు ఎంతో బాధ పడ్డాను. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. వైసీపీ నాయకులకే సపోర్టు చేశారు. ఒకరిద్దరు అధికారులు కూడా వైసీపీ నేతలకు తొత్తులుగా మారారు. అయినా నా మనోస్థైర్యం కొంచెంకూడా సడలలేదు. సిక్కోలు సివంగి ఏ విధంగా ఉంటుందో ప్రస్తుతం వారికి ట్రైలర్ మాత్రమే చూపించాను. ముందుంది ముసళ్ల పండుగ. తెలుగు మహిళకు పౌరుషం వస్తే ఏ విధంగా ఉంటుందో అనేది ఎన్నికల తరువాత చూపిస్తా.

➡ **ప్ర:** ఉమ్మడి మేనిఫెస్టోపై స్పందన ఎలా ఉంది?

➡ **జ:** సూపర్‌గా ఉంది. మేనిఫెస్టోకు సామాన్య ప్రజలతో పాటు ఉద్యోగులు, ఉపాధ్యాయుల నుంచి కూడా పెద్ద ఎత్తున స్పందన వస్తోంది. ఎన్నికల ప్రచారానికి వెళితే వస్తున్న జనాలే ఇందుకు నిదర్శనం. సూపర్‌సిక్స్ పథకాలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. రానున్నది కూటమి ప్రభుత్వమే.

సామాజిక వర్గాల ఓటర్లకు గేలం

- ఆత్మీయ కలయిక పేరుతో సమావేశాలు
- అండగా నిలవాలని కోరుతున్న అభ్యర్థులు

నందిగాం/పలాస: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సమీపిస్తుండడంతో రాజకీయపార్టీల అభ్యర్థులు సామాజిక వర్గాల ఓటర్లకు గేలంవేసే పనిలో పడ్డారు. ప్రధాన సామాజిక వర్గాలపై కన్నేశారు. ఈ మేరకు ఆత్మీయ కలయిక పేరుతో సమావేశాలు ఏర్పాటుచేసి, అండగా నిలవాలని కోరుతున్నారు. టీడీపీ, వైసీపీ అభ్యర్థులు ఆయా సామాజిక వర్గాల నాయకుల నేతృత్వంలో సమావేశాలు ఏర్పాటుచేసి తమకు ఓట్లువేసి శాసనసభ, పార్లమెంట్లకు పంపా లని కోరుతున్నారు. మీకు అన్నివిధాలుగా అండగా ఉంటామని భరోసా ఇస్తున్నారు. తాము అధికారం లోకి వస్తే అమలుచేసే పథకాలను వివరిస్తున్నారు. వైశ్య, వెలమ, రెడ్డిక, యాదవ తదితర అధిక ఓట్లు ఉన్న సామాజిక వర్గాలతో సమావేశాలు నిర్వహించి అభివృద్ధి, సంక్షేమానికి భరోసా ఇస్తామని హామీ ఇస్తూ ఎన్నికల్లో ఓట్లు వేసేలా చూడాలని కోరుతున్నారు.

ఓట్ల కోసం ప్రమాణాలు..

సామాజిక వర్గాలకు వైసీపీ నాయకులు భారీగా తాయిలాలు ప్రకటిస్తుండడంతో పాటు వారితో తమ పార్టీకే ఓటు వేయాలని దేవుని ఎదుట ప్రమాణాలు చేయిస్తున్నారు. వజ్రపుకొత్తూరు మండలంలోని ఓ మత్స్యకార గ్రామంలో సోమవారం సాయంత్రం కొందరు మత్స్యకారులతో వైసీపీ నాయకులు ప్రమాణం చేయించారు. ఇది ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆ గ్రామంలో మత్స్యకారులు మొత్తం మూడు వర్గాలుగా ఉన్నారు. ఇందులో ఓ వర్గం వైసీపీకి అనుకూలంగా ఉండగా, మిగిలిన రెండు వర్గాలు టీడీపీ-జనసేన కూటమికి వైపు ఉన్నాయి. ప్రధానంగా 500 ఓట్లు అధికార పార్టీకి చెందిన అగ్రనాయకుల సామాజిక వర్గానికి చెందినవి. దీంతో వైసీపీకి తప్పనిసరిగా వేయాలని అక్కడ నాయకులు సూచించారట. అయితే ఈ ఓటర్లలో టీడీపీ అభిమానులు ఎక్కువగా ఉండడంతో ఎందుకొచ్చిన గొడవని వారికి ప్యాకేజీ ప్రకటించడంతోపాటు వైసీపీకే ఓటు వేసే విధంగా ఏకంగా గుడిలోనే సత్యప్రమాణాలు చేయించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.



అక్కా ఎల్చన్లు వచ్చాయట..


- గ్రామాల్లో మహిళల చర్చ

(పలాస రూరల్)

అక్కా ఎల్చన్లు వచ్చాయట.. ఓట్ల కోసం ఇవాల ఆ పార్టీవోల్లు మన ఊరొస్తరట వంటి వాటిపై గ్రామాల్లోని బావులు, పంపుసెట్ల వద్ద మహిళలు చర్చించుకుంటున్నారు. సార్వత్రిక ఎన్నిక పోలింగ్‌కు ఇంకా మరో నాలుగు రోజులే మాత్రమే మిగిలిఉంది. రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచార ఉధృతిని కూడా పెంచాయి. అన్నిపార్టీల నాయకులు గ్రామీణ ప్రాంతాల్లో మహిళా ఓటర్లను ఆకట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద, అంగళ్లు, బావులు, కొళాయిల వద్ద మహిళలు గుంపులుగా చేరి ఎన్నికలపైనే చర్చించుకుంటున్నారు. జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. దీంతో వారి ఓట్లు గెలుపోటముల్లో కీలకంగా మారాయి. ప్రధాన పార్టీల నాయకులు ఉదయం ఆరు గంటల నుంచే ప్రచారం ప్రారంభిస్తున్నారు. ఆ సమయంలో గ్రామ చావళ్లు, బావుల వద్దకు ఉదయం నీటికోసం వచ్చే మహిళలను అభ్యర్థులు కలుసు కుంటున్నారు. దీంతో పాటు నలుగురైదుగురు మహిళలు ఒక దగ్గరకు చేరి పిచ్చాపాటిగా ఎన్నికలపై మాట్లాడుకుంటున్నారు.

సీనియర్ ఓటరు

ప్రజలకు మంచి చేసే నాయకుడికి ఓటేయాలి



మందస: ఓటు వేసే ముందు ప్రతిఒక్కరూ ఆలోచించాలి. ప్రజలకు మంచి చేయడంతో పాటు అన్ని విధాలా ఉపయోగపడే నాయకుడికి ఓటు వేయాలి. ఇప్పటివరకు ఆరుసార్లు నేను ఓటు వేశాను. అప్పటి రాజకీయాలకు, ఇప్పటి రాజకీయాలకు ఎంతో వ్యత్యాసం ఉంది. గతంలో పోటీదారులు మధ్య స్నేహపూర్వ వాతావరణం ఉండేది. నాయకులు ప్రజలకు ఎంతో గౌరవం ఇచ్చేవారు. ప్రస్తుతం సమాజంలో నైతిక విలువలు లేవు. రాజకీయల్లో అవినీతి ఎక్కు వైంది.

-బెస్త కామేశ్వరరావు, మహేంద్ర రైతుసంఘం అధ్యక్షుడు

పోలీసైనా నో ఎంట్రీ..

(హిరమండలం/నరసన్నపేట)



ఏ ఎన్నికలైనా ప్రశాంతంగా జరగాలంటే పోలీసులదే కీలక పాత్ర. అభ్యర్థుల ప్రచారాలు, సభలు, ర్యాలీలకు వారి అనుమతులు తప్పనిసరి. పోలింగ్ రోజు ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునేలా బందోబస్తు నిర్వహిస్తారు. అయినప్పటికీ పోలింగ్ కేంద్రం లోపలకి వెళ్లేందుకు వారికి అనుమతి లేదు. పోలింగ్ జరుగుతున్న సమయంలో ఎలాంటి సమస్య వచ్చినా సాధ్యమైనంత వరకు కేంద్రంలోని ఎన్నికల అధికారే సిబ్బందితో ఆయా సమస్యను పరిష్కరించుకుంటారు. శాంతిభద్రతల సమస్య తలెత్తినప్పుడు ఎన్నికల అధికారి పిలిస్తే తప్ప ప్రత్యేక కారణం లేకుండా పోలీసులు బూత్‌లోకి పోవడానికి అనుమతి లేదు. పోటీ చేసే అభ్యర్థి అయినా, ఇంకా ముఖ్యమైన వ్యక్తి ఓటు వేసేందుకు వచ్చినా వారి భద్రత సిబ్బంది మాత్రం పోలింగ్ కేంద్రం బయటే ఆగాలి. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బందికి ఇబ్బంది కలిగించే ఏ పని కూడా ముఖ్యమంత్రి గానీ, మంత్రులు గానీ వారి అనుచరులు కానీ చేయకూడదు. పోటీలో ఉన్న అభ్యర్థి జడ్ ప్లస్ కేటగిరీ రక్షణ ఉన్నా వారి వెంట వచ్చే సిబ్బందిని పోలింగ్ కేంద్రంలోకి అనుమతించరు. మఫ్టీలో ఉన్న భద్రతా సిబ్బంది ఒకరికి మాత్రమే అనుమతి ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కేబినెట్ మంత్రులు, ఉప ముఖ్యమంత్రులకు భద్రతా సిబ్బంది ఉంటారు. వారు కూడా పోలింగ్ కేంద్రం లోపలకు వెళ్లకూడదు. పదవుల్లో ఉన్నవారు పోలింగ్ కేంద్రంలో ఓటర్లను ప్రభావితం చేసేలా ప్రవర్తించకూడదు. ఎలాంటి మాటలు, సైగలు చేసినా నేరంగా పరిగణిస్తారు. పోలింగ్ సిబ్బంది రాజకీయ నాయకులు, మంత్రుల మాటలు పట్టించుకోకుండా ఎన్నికల సంఘం ఆదేశాలను మాత్రమే అమలు చేయాలి. ఎన్నికల సంఘం అనుమతి పత్రం ఉంటేనే కేంద్రంలోకి అనుమతించాలి.

జన కేతనం
ఆంధ్రజ్యోతి
గురువారం 9 మే 2024



ఎన్నికల తర్వాతే చూసుకుందాం మిత్రమా!

మెళియాపుట్టి: ఏం తమ్ముడు .రేపు పనిఉంది వస్తావా.. ? అని అడిగితే ఎవరూ ముందుకు రావడం లేదు. ఖాళీలేదు మిత్రమా..ఎన్నికలు తర్వాత చూసుకుందామని ప్రతి ఒక్కరి నోట ఇదే వినిపిస్తోంది. ఎన్నికల ప్రచారంలో కొందరు కూలీలు నిమగ్నమయ్యారు. దీంతో కొంత మంది పొలంపనులు ఎన్నికలు తర్వాత చేసుకుందామని వాయిదా వేసుకుం టున్నారు. ఎన్ని కల ప్రచారానికి వెళ్తే రూ.500తో పాటు మందు, బిర్యానీ దొరకుతుందని కూలీలు చెబుతు న్నారు. పనిలేకుండా హాయిగా జెండాపట్టి జేజేలు కొడితే డబ్బులు వస్తుండడంతో ప్రచార కార్యక్రమాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు.

అడ్డదారుల్లో.. తరలింపు

- ఓటర్లకు డబ్బుల పంపిణీకి 'సిద్ధం'!
- ముందుగానే మేల్కొన్న అధికారపార్టీ నేతలు
- అధికారుల తనిఖీల్లో సామాన్యులే పట్టుబడుతున్న వైనం

(మెళియాపుట్టి)

సార్వత్రిక ఎన్నికల వేళ.. రాజకీయ నేతలు రూ.కోట్లలో డబ్బులు ఖర్చు చేస్తున్నారు. పోలింగ్ తేదీ గడువు సమీపిస్తుండడంతో అభ్యర్థులు ముందుగానే మేల్కొని అడ్డదారుల్లో డబ్బులు తరలించే పనిలో నిమగ్నమయ్యారు. నిబంధనల మేరకే అభ్యర్థుల వ్యయపరిమితి ఉండాలని ఎన్నికల సంఘం ఆదేశించినా.. ఇవి ఎక్కడా అమలుకావడం లేదనేది బహిరంగ రహస్యం. డబ్బు, మద్యం, బంగారు ఆభరణాల తదితరవి పరిమితికి మించి తరలిపోకుండా ఉండేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. మరోవైపు చెక్‌పోస్టుల వద్ద కూడా పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. కాగా.. ఈ తనిఖీల్లో అవగాహన లేని సామాన్య ప్రజలే పట్టుబడుతున్నారు తప్ప.. ఇప్పటివరకూ ఒక్క రాజకీయ నాయకుడు కానీ, అభ్యర్థులు కానీ దొరక్కపోవడం గమనార్హం. దీనిని బట్టి నేతలు ముందే జాగ్రత్త పడినట్టు అర్థమవుతోంది. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే వైసీపీ అభ్యర్థులను ప్రకటించింది. దీంతో ఆ పార్టీ అభ్యర్థులంతా ముందుగానే డబ్బులు, మద్యం సమకూర్చుకున్నారనే ప్రచారం సాగుతోంది. ఎన్డీయే కూటమి అభ్యర్థులుగా కొత్తవారికి అవకాశం కల్పించారు. దీంతో అభ్యర్థుల ప్రకటన ఆలస్యమైంది. ఈ క్రమంలో వారు డబ్బులు సమకూర్చుకోవడంలో వెనుకబడినట్టు తెలుస్తోంది.



వసుంధర చెక్‌పోస్టు ఇదే



ఒడిశా- రట్టిణి అడ్డు దారి ఇదే

అక్రమార్జనతోనే..

ఎన్నికల్లో ప్రచార ఖర్చులు ఒక ఎత్తయితే.. పోలింగ్‌కు ముందు రోజు ఓటర్లకు డబ్బుల పంపిణీ మరో ఎత్తు. ఒక్కో అసెంబ్లీ అభ్యర్థికి రూ.30 కోట్ల నుంచి రూ.50కోట్ల వరకు ఖర్చువుతుంది. ఎంపీ అభ్యర్థులు సైతం నియోజకవర్గానికి రూ.5కోట్లకుపైగా వెచ్చించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అధికారుల కళ్లు గప్పి.. అభ్యర్థులు అడ్డదారుల్లో డబ్బులు తరలించేస్తున్నారు. అధికారపార్టీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేలనే ఈ సారి ఎన్నికల బరిలో కూడా దించారు. దీంతో వారు ఇసుక, మైనింగ్ ద్వారా అక్రమార్జనతోనే ఎన్నికలకు దిగారనే ఆరోపణలు ఉన్నాయి. ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసే బాధ్యతను వారికి నమ్మకమైన బంధువులకు అప్పగించారని తెలుస్తోంది. ఓట్లను ప్రభావితం చేయగలిగే సర్పంచ్, ఎంపీటీసీలు వంటి నాయకులకు రూ.5లక్షల నుంచి రూ.10లక్షలు చొప్పున జేబు ఖర్చుల కిందట ఒక అధికారపార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యే అందజేశారనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే ఎన్నికల కోడ్ రాకముందే వలంటీర్లు, జర్నలిస్టులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంఘాల నాయకులకు కూడా పలువురు అధికారపార్టీ అభ్యర్థులు డబ్బులు అందజేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కొన్నిచోట్లే చెక్‌పోస్టులు

గత ఎన్నికల మాదిరి.. ఈ సారి చెక్‌పోస్టులు ఏర్పాటు చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉదాహరణకు రట్టిని వద్ద చెక్‌పోస్టు లేకపోవడంతో పాతపట్నం నుంచి అధికంగా కేరండి మీదుగా మెళియాపుట్టికి డబ్బులు చేరుతున్నట్టు తెలుస్తోంది. సరాళి రోడ్డు మార్గంలో సైతం డబ్బు అక్రమంగా తరలిపోతోందనే ప్రచారం సాగుతోంది. పాతపట్నం నియోజకవర్గంలో వసుంధర, పాతపట్నం, పట్టుపురం, గొప్పిలి ప్రాంతాల్లో మాత్రమే చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి.. మిగతా అడ్డదారులను వదిలేయడంతో నేతలకు కలిసి వస్తోంది. అడ్డదారుల్లో కూడా పోలీసులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ఐదో రోజు పోస్టల్ బ్యాలెట్ వినియోగం

టెక్కలి, మే 8: టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గంలో ఐదో రోజు బుధవారం 170మంది ఉద్యోగులు పోస్టల్‌బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. పోస్టల్‌బ్యాలెట్ వినియోగానికి గురువారం ఆఖరి రోజు అని ఆర్వో నూరుల్ కమర్ తెలిపారు. **ఆమదాలవలస:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రంలో ఐదో రోజు బుధవారం 225 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గత నాలుగు రోజులుగా ఈ పోలింగ్ కేంద్రంలో 2,873 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. **పాతపట్నం:** స్థానిక ఏపీ మోడల్‌స్కూల్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గ పోస్టల్ బ్యాలెట్‌లో బుధవారం 185 ఓట్లు పోలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.అప్పారావు తెలిపారు. నియోజకవర్గపరిధిలో 2,590 ఓట్లకుగానూ 2548 ఓట్లు పోలైయ్యాయని, 98 శాతం ఓటింగ్ జరిగిందని చెప్పారు.

అభ్యర్థుల వ్యయ పరిమితి ఇదే..

(నరసన్నపేట)

దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో పోటీచేసే లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థుల వ్యయపరిమితిని కేంద్ర ఎన్నికల సంఘం సూచన మేరకు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించింది. ఈమేరకు కేంద్రన్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన విదితమే. లోక్‌సభ ఎన్నికలకు పెద్ద రాష్ట్రాల్లో అభ్యర్థుల వ్యయపరిమితిని గరిష్ఠంగా రూ.95లక్షలు, చిన్న రాష్ట్రాల్లో గరిష్ఠంగా రూ.75 లక్షలకు కేంద్రం పెంచింది. ఇప్పటి వరకు ఈ వ్యయపరిమితి పెద్దరాష్ట్రాలకు రూ.70లక్షలు చిన్న రాష్ట్రాల్లో రూ.54 లక్షలుగా ఉండేది. అలాగే అసెంబ్లీ ఎన్నికలకు పెద్దరాష్ట్రాల్లో వ్యయపరిమితిని రూ.28లక్షలు నుంచి గరిష్ఠంగా రూ.40లక్షలకు, చిన్నరాష్ట్రాల్లో రూ.20 లక్షల నుంచి రూ.28 లక్షలకు పెంచారు. కొత్త వ్యయ పరిమితి మేరకు ప్రస్తుతం నాలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ, దేశంలో 543 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి.

కండువా ఉండాల్సిందే

మెళియాపుట్టి: కండువా. అంటే గుర్తొచ్చేది రాజకీయ పార్టీ. ఎవరైనా ఇతర పార్టీల నాయకులు చేరితే కండువాలు కప్పి ఆహ్వానిస్తారు. ప్రస్తుతం లోక్‌సభ,అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికలు ప్రచారం ఉధృతంగా సాగుతోంది. ర్యాలీలు, ప్రచారానికి వచ్చే ప్రతి కార్యకర్త, నాయకుడి మెడలో కండువా ఉండాల్సిందే. ప్రస్తుతం పార్టీ ప్రధాన కార్యాలయాల నుంచి వేలాది కండువాలు వచ్చినా అవి సరిపోకపోవడంతో స్థానికంగా అభ్యర్థులు మరికొన్నింటిని సేకరించారు. అయితే టీడీపీకి చెందిన పసుపు కండువా గతంలో రూ. 50 నుంచి రూ.300 వరకు ఉంటే ప్రస్తుతం రూ.300 నుంచి రూ.500వరకు వ్యాపారులు విక్రయి స్తున్నారు. కాటన్ కండువాలు అధికంగా దుస్తుల దుకాణాల్లో అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం కండువాలకు గిరాకీ నెలకొందని దుస్తుల వ్యాపారులు చెబుతున్నారు. ఎండల తీ వ్రతకు చెమటను తుడుసుకోవడానికి కూడా కండువాలు ఉపయోగపడుతున్నాయి. పాతపట్నానికి చెందిన ఓ వ్యాపారి మూడు లక్షలు వరకు కండువాలను విక్రయించినట్లు సమాచారం.

డీజేలు.. డప్పులు

- ప్రచారంతో హోరెత్తుతున్న గ్రామాలు.. పట్టణాలు

(శ్రీకాకుళం-ఆంధ్రజ్యోతి)



మారుతున్న కాలానికి అనుగుణంగా ఎన్నికల ప్రచారం కూడా కొత్త పుంతలు తొక్కుతోంది. ప్రచార వ్యయం రాను, రాను పెరుగుతూ పోతోం ది. ఇప్పుడు ప్రచారం డీజేలు, థాసా డప్పులతో హోరెత్తుతోంది. భారీ సౌండ్ స్పీకర్లతో ప్రచారం సాగుతోంది. థాసా డప్పులు కూడా హోరెత్తిస్తు న్నాయి. వీటితో పాటు సామాజిక మధ్యమాలు వాట్సాప్, ఎక్స్, ఇన్‌స్ట్రాగ్రామ్, ఫేస్‌బుక్ తదితర వాటితో పాటు ఐవీఆర్ కాల్స్ కూడా చేస్తున్నారు. నాయకుడు వచ్చినప్పుడు వీధులు, గ్రామాలు, పట్టణాల్లో భారీ ఎత్తున బాణసంచా కాల్చుతున్నా రు. ఇవి ఒక్కోసారి హద్దు దాటుతుండడం గమనార్హం. మరికొన్ని చోట్ల ఓటర్లకు మద్యం, నగదు, బంగారం, వెండి వస్తువులతో పాటు యువకులకు క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్నారు. ఈ పంపిణీ కార్యక్రమం ఒకప్పుడు ప్రత్యేకంగా జరిగేది. ఇప్పుడు ప్రచారంలో భాగంగానే కానిచ్చేస్తున్నారు.

పాతకు చెల్లుచీటీ.. కొత్తబాట పట్టి!

- ఎన్నికల ప్రచారంలో పెనుమార్పులు
- ఆటో ప్రచారాలు నామమాత్రం
- గోడలపై రాతలకు కాలం చెల్లు
- కరపత్రాల ఊసు లేదు
- ఇంటింటికీ తిరిగడం పైనే అభ్యర్థుల ఆసక్తి

(శ్రీకాకుళం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల ప్రచారం తీరు పూర్తిగా మారిపోయింది. గతం లో జరిగిన ప్రచారాలతో పోలిస్తే అభ్యర్థులు కొత్త విధానా లను అనుసరిస్తున్నారు. ప్రచారం పట్ల ప్రజల్లో అంతగా ఆసక్తి కనిపించకపోవడం ఒక కారణమైతే.. మరో వైపు వ్యయ పరిమితి గరిష్ఠ స్థాయిని దాటిపోకూడదన్న ఉద్దేశంతో అభ్యర్థులు ఆచి తూచి అడుగులేస్తున్నారు. దీంతో ప్రచారంలో పాత పద్ధతులు కనుమరుగవుతున్నాయి. గతంలో నామినే షన్ల ఘట్టం ముగిసినప్పటి నుంచీ పోలింగ్ ముందు రోజు వరకూ ప్రధాన పార్టీల నాయకులు ప్రచారాన్ని హోరెత్తిం చేవారు. ఒకప్పుడు.. అంటే సుమారు నాలుగు దశాబ్దాల కిందట ఇనుప రేకులతో తయారు చేసిన ప్రింట్‌లపై, నీలి మందు రాసి గోడలపై అచ్చులు వేసేవారు. దీనిపై అభ్యర్థి పేరు, ఎన్నికల గుర్తు ఉండేవి. పోలింగ్ తేదీని కూడా ఎక్కువ ప్రచారం చేసేవారు. చాలా కాలం తరువాత ఈ విధానానికి స్వస్తి పలికారు. ఆ తరువాత, మండల కేంద్రాల్లో ఎన్నికల కార్యాలయాలు ప్రారంభించి, ఉదయం నుంచి రాత్రి వరకూ మైకులతో గోల పుట్టించేవారు. మండల పరిధిలోని గ్రామాల కు పార్టీ జెండాలు, టోపీలు, బ్యానర్లు,ఇతర ఎన్నికల ప్రచార సామగ్రి ఈ కార్యాలయాల నుం చే పంపిణీ చేసేవారు. ఇవన్నీ కాకుండా ఒక్కో పార్టీ నుంచి కనీసం పది నుంచి పదిహేను వరకూ ఆటోలు, రిక్షాలు ఏర్పా టు చేసుకొని ఏ గ్రామాన్నీ, ఏ వీధినీ వదిలి పెట్టకుండా తిరిగే వారు. వేలాదిగా కరపత్రాలు పంచేవారు. గోడ పత్రికలు కూడా ముద్రించి అంటించే వారు. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా గోడలు ఖాళీగా కనిపిస్తే.. అభ్యర్థుల పేర్లను రాసి ప్రచారం చేసేవారు.

వ్యయంపై ఆంక్షలతో...

ప్రస్తుతం ప్రచారంలో ఆ హడావుడి కనిపించడం లేదు. కనీసం 2014 ఎన్నికల నాటి ప్రచారాల స్పీడు కూడా ప్రస్తుతం కానరావడం లేదు. వ్యయ పరిమితిపై ఎన్నికల కమిషన్ విధించిన నిబంధనలు దీనికి ప్రధాన కారణం. ఈ తరహా ఎన్నికల ప్రచారాలపై ప్రజలకు ఆసక్తి తగ్గడం కూడా ఒక కారణంగా కనిపిస్తోంది. లక్షలాది రూపాయలు వెచ్చించి ప్రచారం ఏ స్థాయిలో చేసినా... ఆఖరి రోజుల్లో చాప కింద నీరులా సాగే పంపిణీపైనే అభ్యర్థులు ఎక్కువగా నమ్మకం పెట్టుకోవడమే దీనికి ప్రధాన కారణం. దీంట్లో భాగంగా అభ్యర్థులు తమ ప్రచారంలో కొత్త పంథాను అనుసరిస్తున్నా రు. డబ్బులు వెచ్చించి, మైకు సెట్లలో హోరెత్తించడం కంటే ఇంటింటి ప్రచారంపైనే మొగ్గు చూపిస్తున్నారు. ఇప్పటి వరకూ తమ హయాంలో జరిగిన పనులను అధికార పార్టీ నాయకులు, అభ్యర్థులు ప్రజలకు వివరిస్తుండగా... ప్రతిపక్షం నుంచి పోటీకి నిలబడిన నాయకులు భవిష్యత్తులో తాము అధికారంలోకి వస్తే ఏం చేస్తామో వివరిస్తున్నారు. కొంతమంది అభ్యర్థుల తరపున ప్రచారం చేస్తున్న మహిళలు ప్రశాంతంగా గ్రామాల్లోకి వెళ్లి... మహిళా ఓటర్ల నుదుటన తిలకం దిద్ది.. ఓట్లు అడుగుతున్నారు. పార్టీ అధినాయకులు వచ్చిన సందర్భాల్లో తప్ప బహిరంగ సభలు, రోడ్ షోలు నిర్వహించడం లేదు. ఇది ఇలా ఉండగా.. ప్రచారంలో వచ్చిన మార్పులు కొంతమంది వృత్తిదారుల ఉపాధి అవకాశాలను దెబ్బ తీశాయి.





టెక్కలి: బూరగాంలో ఎన్నికల ప్రచారంలో అచ్చెన్నాయుడు



హిరమండలం: రోడ్‌షో నిర్వహిస్తున్న కింజరాపు రామ్మోహన్‌నాయుడు, మామిడి గోవిందరావు



పలాస: 23వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న గౌతు శిరీష

చంద్రబాబుతోనే ప్రజా సంక్షేమం

- కూటమి అభ్యర్థుల ప్రచారం

ఇచ్ఛాపురం/పలాస/ఆమదాలవలస/రణస్థలం/టెక్కలి/హిరమండలం/జలుమూరు/అరసవల్లి, మే 8: విజనరీ ఉన్న నాయకుడు చంద్రబాబునాయుడు అని, ఆయనతోనే ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందని కూటమి అభ్యర్థులు పేర్కొన్నారు. బుధవారం పలుచోట్ల ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి మేనిఫెస్టోను వివరించి ఓట్లు వేయాలని ప్రజలను కోరారు. టెక్కలి మండలం బూరగాంలో కింజరాపు అచ్చెన్నాయుడు, పలాస మున్సిపాలిటీ 23వ వార్డులో గౌతు శిరీష, ఆమదాలవలస మండలం ఎస్ఆర్‌పీపేటలో కూన రవికుమార్, శ్రీకాకుళం రూరల్ మండలం పాత్రునివలస టిడ్కో కాలనీలో గొండు శంకర్, ఇచ్ఛాపురం మండలం బొడ్డకాళిలో బెందాళం అశోక్, జలుమూరు మండలం దరివాడలో బగ్గు రమణమూర్తి, రణస్థలం మండలం కొచ్చెర్లలో నడుకుదిటి ఈశ్వరరావు ఎన్నికల ప్రచారం నిర్వహిం చారు. హిరమండలంలోని గొట్ట గ్రామం నుంచి ధనుపురం వరకు ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మో హన్‌నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి మామిడి గోవిందరావు రోడ్‌షో నిర్వహించారు.



ఆమదాలవలస: ఎస్ఆర్‌పీపేటలో మాట్లాడుతున్న కూన రవికుమార్



ఇచ్ఛాపురం: బొడ్డకాళిలో ప్రచారం చేస్తున్న బెందాళం అశోక్



అరసవల్లి: పాత్రునివలస టిడ్కో కాలనీలో ప్రచారం చేస్తున్న గొండు శంకర్



జలుమూరు: దరివాడలో ప్రచారం నిర్వహిస్తున్న బగ్గు రమణమూర్తి



రణస్థలం: కొచ్చెర్లలో నడుకుదిటి ఈశ్వరరావుకు హారతి ఇస్తున్న మహిళలు

రానున్నది కూటమి ప్రభుత్వమే: ఎంపీ



ర్యాలీలో మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు, చిత్రంలో మామిడి గోవిందరావు

మెళియాపుట్టి/హిరమండలం/పాతపట్నం: రానున్నది కూటమి ప్రభుత్వమేనని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. బుధవారం గొట్టా నుంచి గొప్పిలి వరకు పాతపట్నం ఉమ్మడి అభ్యర్థి మామిడి గోవిందరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణతో కలిసి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రానికి చేసిన అభివృద్ధి ఏదీ లేదన్నారు. రాష్ట్రాన్ని అప్పుల్లో నెట్టి ప్రజలపై భారం మోపారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎంపీగా తనను, ఎమ్మెల్యేగా మామిడి గోవింద రావును గెలిపించాలన్నారు. జడ్పీటీసీ పి.బుచ్చిబాబు, జనసేన నాయకుడు గేదెల చైతన్య, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం

అరసవల్లి: వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు సతీమణి శ్రావ్య అన్నారు. బుధవారం నగరంలోని మండల వీధి, గూనపాలెం తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలు, ఉమ్మడి మ్యానిఫెస్టోలను వివరించారు. రానున్న ఎన్నికల్లో ఎంపీగా రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యేగా గొండు శంకర్ లను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ హరిత, టీడీపీ నాయకులు కొర్ను నాగార్జున ప్రతాప్, కోరాడ హరగోపాల్, పిరియా మాధవి, బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబుపై నమ్మకంతో టీడీపీలోకి వలసలు: బగ్గు

నరసన్నపేట: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడుపై నమ్మకంతో వైసీపీ నేతలు, క్యాడర్ స్వచ్ఛందంగా ఆ పార్టీని వీడి టీడీపీలోకి వస్తున్నారని ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో తామరాపల్లి గ్రామ వైసీపీ నేతలు కల్లేపల్లి రామారావు, కోల అప్పారావు, కృష్ణ, రమణ, గణేష్ ఈ అసిరినాయుడు, కోల సింహాచలం, రమణ, సంతోష్‌తో పాటు 15 కుటుంబాలు టీడీపీలో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల అభ్యున్నతికి ఎన్డీఏ కూటమి పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వంలో అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో కోల రాము, బైరి తవిటియ్య, గెంబలి ప్రభాకరరావు, గొద్దు జగన్మోహనరావు, దుంగ సింహాచలం, రెడ్డి సతీష్ తదితరులు పాల్గొన్నారు. ● **పోలాకి:** మబగాం గ్రామం డీఆర్ కాలనీ వాసులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. డీఆర్ కాలనీలోని కల్లేపల్లి సింహాచలం, జామి మోహనరావు, చల్లా రమేష్, ముచ్చు సింహాచలంతోపాటు 10 కుటుంబాలు టీడీపీలో చేరగా వారికి ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి కండువాలు కప్పి ఆహ్వానించారు.

● **జలుమూరు:** దరివాడ, గొటివాడ పంచాయతీ నుంచి పలువురు నేతలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. బగ్గు రమణమూర్తి బుధవారం పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.



బగ్గు రమణమూర్తి ఆధ్వర్యంలో టీడీపీ చేరిన తామరాపల్లి గ్రామస్థులు

టీడీపీతోనే అన్ని వర్గాల సంక్షేమం: శిరీష



టీడీపీలో చేరిన వైసీపీ మహిళా నేతలతో ఉమ్మడి అభ్యర్థి గౌతు శిరీష తదితరులు

కాశీబుగ్గ/పలాస/వజ్రపుకొత్తూరు/హరిపురం: టీడీపీతోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని ఉమ్మడి అభ్యర్థి గౌతు శిరీష అన్నారు. పట్టణం లోని 4, 23 వార్డుల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో పట్టణం అభివృద్ధి చెందిందని, మరలా ఉమ్మడి ప్రభుత్వంలో జంట పట్టణాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పట్టణ ప్రజలు చూపుతున్న ఆదరణ ఆనందంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును అత్యధిక మెజార్టీతో గెలింపించాలని కోరారు. 4వ వార్డు శాంతి నగర్ కాలనీలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారికి శిరీష కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు యాదవ్, దువ్వాడ శ్రీకాంత్, నాగరాజు, నవీన్, మల్లేశ్వరరావు, నర్సింహులు, యుగంధర్, వజ్జ భవానీ తదితరులు పాల్గొన్నారు. వజ్రపుకొత్తూరు మండలం కొండపూరు గ్రామానికి చెందిన సీనియర్ వైసీపీ నాయకులు డొక్కరి దాలయ్య తన అనుచరులతో టీడీపీలో చేరారు. మందస మండలం గంగువాడ, రాంపురం, బిడిమి గ్రామాల్లో బుధవారం ఉమ్మడి అభ్యర్థి గౌతు శిరీష ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బిడిమి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే జుత్తు జగన్నాయకులు భార్య ధనలక్ష్మి, కుటుంబసభ్యులు శిరీషను సత్కరించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బావన దుర్యోధన, జుత్తు కూర్మారావు, పొట్టి మోహనరావు, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

సైకో జగన్ పాలనకు స్వస్తి పలకండి: రవికుమార్



రవికుమార్‌కు మద్దతిస్తున్న రిటైర్డ్ అధికారులు

ఆమదాలవలస: రాష్ట్రాన్ని చేతకాని పాలనతో అప్పుల ఊబిలోకి నెట్టేసిన సైకో సీఎం జగన్ పాలనకు ప్రజలు స్వస్తి పలికి రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబుకు మద్దతు పలకాలని ఆమదాల వలస నియోజకవర్గ అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి కూన రవికుమార్ అన్నారు. బుధవారం మునగవలస, దన్నానపేట, సంతకొత్తవలస, మండాది, ఎస్ఆర్‌సీ పేట, అక్కులపేట, చింతలపేట, దండేవలస, బొబ్బిలిపేట, ముద్దాడపేట, కలివరం, దూసిపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పేడాడ సూరపు నాయుడు, నూకరాజు, తమ్మినేని చంద్రశేఖర్, సనపల ఢిల్లీశ్వరరావు, మెట్ట సుజాత పాల్గొన్నారు. ● **ఆమదాలవలస:** అక్కులపేటలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఉమ్మడి అభ్యర్థి కూన రవికుమార్‌కు రిటైర్డ్ అధికారులు మద్దతు తెలిపారు. రిటైర్డ్ ఆర్ఐవో పాత్రుని పాపారావు, రిటైర్డ్ రవాణాశాఖాధికారి బొడ్డేపల్లి గౌరీపతిరావు, రిటైర్డ్ తహసీల్దార్ బి.జనార్దనరావు తదితరులు రవికుమార్‌ను కలిసి సంఘీభావం తెలిపారు.

ఎన్డీఏ విజయానికి కృషి చేయండి: కలిశెట్టి

రణస్థలం/జి.సిగడాం: రానున్న ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విజయ నగరం పార్లమెంట్ కూటమి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 'చంద్రబాబు గెలుపు.. పెన్షన్ల పిలుపు' కరపత్రాలను బుధవారం రణస్థలంలోని తన క్యాంపు కార్యాలయంలో విడుదల చేశారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం ఉత్తరాంధ్ర ప్రతినిధి యు.కూర్మారావు, ప్రతినిధులు బాలి రామునాయుడు, ఎం.ప్రసాదరావు, మాడుగుల రామారావు, నల్లి అప్పలనాయుడు, టి.జోగా రావు, నాయకులు పాల్గొన్నారు. ● **లావేరు:** టీడీపీతోనే అభివృద్ధి సాధమని ఉత్తరాంధ్ర టీడీపీ రీజనల్ కోఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి, విజయనగరం ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. బుధవారం సుభద్రాపురంలో ఎన్డీఏ కూటమి సమావేశం జరిగింది. ఎచ్చెర్ల ఎమ్మెల్యేగా నడుకుదిటి ఈశ్వరరావుకు కమలం గుర్తు, ఎంపీగా అప్పల నాయుడుకు సైకిల్ గుర్తు పై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ఉమ్మడి పార్టీల నేతలు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న విజయనగరం ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు

లింగాలవలస గడ్డపై తొలిసారి అచ్చెన్న



లింగాలవలసలో పర్యటిస్తున్న అచ్చెన్నాయుడు

టెక్కలి: మూడు దశాబ్దాల తరువాత లింగాలవలస గడ్డపై అచ్చెన్నాయుడు బుధవారం అడుగు పెట్టి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జడ్పీటీసీ వాణి తండ్రి, మాజీ ఎంపీపీ సంపతిరావు రాఘవరావు దొర కంచుకోటగా ఉన్న లింగాలవలస వైపు ఇప్పటి వరకు కింజరాపు కుటుంబం కన్నెత్తి చూడని పరిస్థితి. ప్రతిసారి ఆయన కుటుంబ సభ్యులు కింజరాపు కుటుంబం చేతిలో పరాజయం పొందుతూనే ఉంది. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మావగారైన రాఘవరావు ఆధీనంలోనే ఆ గ్రామం ఇప్పటి వరకు ఉంది. అయితే తొలిసారి అచ్చెన్నాయుడు ఆ గ్రామంలో పర్యటించగా స్థానికుల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. మాజీ సర్పంచ్ సుజాత భర్త రిటైర్డ్ ఉద్యోగి సంపతిరావు రవీంద్ర ఆధ్వర్యంలో అచ్చెన్నకు స్వాగతం పలికారు. లింగాలవలసను అభివృద్ధి చేసే బాధ్యత తాను తీసుకుంటానని అచ్చెన్నాయుడు తెలిపారు. ● రామేశ్వరం, బూరగాం, గూడెం, పిట్టలసరియా, నీలాపురం తదితర గ్రామాల్లో అచ్చెన్నాయుడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి తదితరులు పాల్గొన్నారు. ● **నందిగాం:** మండలంలోని దిమిలాడ, లఖిదాసుపురం, నర్శిపురం, దేవళభద్ర పంచాయతీల్లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దిమిలాడలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు డిక్కల రాజు తదితరులు టీడీపీలో చేరగా వారికి అచ్చెన్నాయుడు కండువాలు కప్పి ఆహ్వానించారు. టీడీపీ మండల నాయకులు పి.అజయ్‌కుమార్, పి.చంద్రశేఖర్, ఎం.బాలకృష్ణ, జనసేన నాయకులు కె.కిరణ్ కుమార్, టి.చిరంజీవి, ఎస్.షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి మేనిఫెస్టోతో అన్ని వర్గాల అభ్యున్నతి: శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న గొండు శంకర్

అరసవల్లి: రాష్ట్రంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి ఉమ్మడి మేనిఫెస్టో దోహదం చేస్తుందని శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. బుధవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో శ్రీశయన సంఘ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీశయన సామాజిక వర్గ సంక్షేమానికి ఎన్డీయే కూటమి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. ● **అరసవల్లి:** మోడల్ సిటీగా శ్రీకాకుళం నగరాన్ని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. బుధవారం విశాఖ-ఎ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో పట్టణం, రూరల్ మండలానికి చెందిన వైసీపీ నేతలు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. పెద్దపాడు, దమ్మలవీధి, జడ్పీకాలనీ, పొందర వీధికి చెందిన వందలాది మంది కుటుంబ సభ్యులతో కలిసి టీడీపీలో చేరారు. వారికి శంకర్ కండువాలు వేసి ఆహ్వానించారు. ● **శ్రీకాకుళం రూరల్:** ఒక్కసారి పేరుతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వానికి మరో అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని తాకట్టు పెట్టేస్తుందని ఉమ్మడి అభ్యర్థి గొండు శంకర్ విమర్శించారు. పాత్రునివలస టిడ్కో కాలనీ, పట్టణంలోని గొంటివీధిలో బుధ వారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. టీడీపీ నిర్మించిన భవనాలకు వైసీపీ రంగులు వేయడంలో మంత్రి ధర్మానకు ఉన్న శ్రద్ధ టిడ్కో కాలనీలో ఉన్న సమస్యల పరిష్కారంలో లేదన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, నేతలు ఎస్సీ రమణ మాదిగ, గిరిజా శంకర్‌తో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

అరాచక పాలనకు స్వస్తిపలకండి: అశోక్



ఇచ్ఛాపురం: రాష్ట్రంలో అరాచకపాలనకు స్వస్తిపలకాలని ఇచ్ఛాపురం అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి బెందాళం అశోక్ అన్నారు. బుధవారం బొడ్డకాళి, హరిపురం, కొళిగాం, పాయితారి, కీర్తి పురం, తోటూరు, బిర్లంగి, మశాఖపురం, ఇన్నే సుపేట, తులసిగాం, పూర్ణాటకం, కొఠారి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలు, ఉమ్మడి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో ఐదేళ్లలో ఉద్యోగాలు లేక యువత నిరుద్యోగులుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో ఎన్డీఏ కూటమిని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు, సహదేవ్‌రెడ్డి, దక్కత శ్రీను, దక్కత రామారావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి: ఎన్ఈఆర్



రణస్థలం: టీడీపీ ప్రభుత్వ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని ఎన్డీఏ కూటమి ఎచ్చెర్ల బీజేపీ అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు, విజయనగరం ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు సతీమణి ప్రభానాయుడుఅన్నారు. బుధవారం యర్రవరం, వీఎన్‌పురం, ఎన్‌జీఆర్‌పురం, పతివాడపాలెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వీఎన్‌పురంలో దివంగత నేత కలిశెట్టి సహదేవుడు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో కమలం గుర్తు, సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి ఎన్ఈఆర్, కలిశెట్టి అప్పల నాయుడును గెలిపించాలన్నారు. కార్యక్రమంలో లంక శ్యామలరావు, కలిశెట్టి సూర్యనారాయణ, పిన్నింటి బాను, బసవ గోవిందరెడ్డి, రౌతు శ్రీనివాసరావు, జగన్నాథం నాయుడు పాల్గొన్నారు.

రిసెప్షన్ కేంద్రం పరిశీలన

రణస్థలం: పోలింగ్ అనంతరం జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి ఈవీఎంలను శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)కు తీసుకురానున్నందున ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీ జీఆర్ రాధిక సూచించారు. బుధవారం ఈవీఎం రిసెప్షన్ కేంద్రాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎస్పీ జి.ప్రేమ్‌కాజల్, సీఐలు, ఎస్ఐ పాల్గొన్నారు.

● **శ్రీకాకుళం క్రైం:** హోమ్‌గార్డుగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన యు.ఉమామహేశ్వరరావుకు సహచర హోమ్ గార్డులంతా ఒక్కరోజు వేతనం రూ. 4.18 లక్షలను సేకరించగా ఆ మొత్తాన్ని ఎస్పీ రాధిక అందించారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఆమె సూచించారు.

విద్యార్థిని మృతి



మాధురి(ఫైల్)

హిరమండలం: పాత హిరమండలం కుమ్మరి వీధికి చెందిన కుమ్మరి బాలమాధురి (15) వంశధార నదిలో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు గుమ్మిలో దిగి మృతి చెందిన ఘటన బుధవారం సంభవించింది. ఎస్ఐ నారాయణ స్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మధురి ప్రతిరోజు తన తల్లి తులసమ్మతో కలిసి గ్రామం పక్కనే ఉన్న నదిలో స్నానానికి వెళ్తుండేది. బుధవారం ఉదయం తల్లికి పని ఉండడంతో తోటి స్నేహితులు కుమ్మరి రాజేశ్వరి, కొర్లాపు దుర్గలతో కలిసి నదికి వెళ్లింది. ముగ్గురు నదిలో స్నానం చేస్తుండగా మాధురి మునిగి కనిపించకుండా పోయింది. దీంతో స్నేహితులు కేకలు పెట్టడంతో కొంత దూరంలో స్నానం చేస్తున్న మాధురి తండ్రితో పాటు మరికొందరు అక్కడకు చేరుకొని నదిలో వెతికారు. కొంతసేపటికి మృతదేహం ఆమె తండ్రికే దొరికింది. దీంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరవుతోంది. మృతురాలు హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది తొమ్మిది చదివి పదో తరగతికి వచ్చింది. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ నారాయణ స్వామి తెలిపారు.

Format C-1

DECLARATION ABOUT CRIMINAL ANTECEDENTS OF CANDIDATE SET UP BY THE PARTY

(As per the judgement dated 25th September, 2018 of Hon'ble Supreme Court in WP (Civil) No.536 of 2011 (Public Interest Foundation & Ors. Vs. Union of India & Anr.)

Name of Political Party : **TELUGUDESAM**
Name of Election : **House of People (General Elections - 2024)**
Name of State/UT : **Andhra Pradesh**

Sl. No.	Name of Constituency	Name of Candidate	[A] Pending Criminal Cases		[B] Details about cases of conviction for Criminal Offences.		
			Name of Court, Case No. & Status of the Case(s)	Section of the Acts concerned & brief description of offence(s)	Name of Court & date(s) of order(s)	Description of offence (s) & Punishment imposed	Maximum Punishment Imposed
1.	02-Srikakulam Parliamentary Constituency	Sri RAMMOHAN NAIDU KINJARAPU	Cr.No.132/2022 of Srikakulam-I Town PS, Srikakulam Dist (Pending Trial vide CC.No.282/2023 on the file of Hon'ble PDM, Srikakulam)	U/Sec.353, 109 r/w 34 IPC Alleged to have deterred the public servant from discharging his duties while observing a dharna.			
2.			Cr.No.156/2021 of Amadalavalasa PS, Srikakulam Dist	U/Sec.341, 188 IPC & Sec.3 of Epidemic Diseases Act. alleged to have participated in a dharna violating the prohibitory orders.	Not Applicable	Not Applicable	Not Applicable
3.			Cr.No.213/2021 of Tekkali PS, Srikakulam Dist.	U/Sec. 143,341,279, 283 r/w 149 IPC & Sec.8(B) NH Act, 1956 and Sec. 129, 190(2), 119, 184, 122 r/w 177 of MV Act, 1988n alleged to have observed dharna violating the prohibitory orders and contravening the provisions of MV Act.			
4.			Cr.No.108/2021 of Pathapatnam PS, Srikakulam Dist	U/Sec. 188, 269, 341 r/w 34 IPC & Sec.3 of Epidemic Disease Act, 1987 - alleged to have participated in dharna violating the prohibitory orders promulgated.			

* In the case of election to Council of States or election to Legislative Council by MLAs, Mention the election concerned in place of name of constituency.